

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.6 కనిష్ఠం 29.9

దేదీప్యమానం..

దశాబ్ది సంబురం..!



ట్యాంక్‌బండ్‌పై స్టాల్‌ను వీక్షిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి

- నగరంలో మిన్నంటిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- ట్యాంక్‌బండ్‌పై అలరించిన కార్యక్రమాలు
- పరేడ్‌గ్రౌండ్‌లో ఆకట్టుకున్న పోలీసుల కవాతు

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో తెలంగాణ దశాబ్ది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్సవాలు కొనసాగాయి. ఉదయం నాంపల్లి లోని గన్‌పార్క్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ పరేడ్ మైదానానికి చేరుకున్న సీఎం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ గేయాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీసు కవాతు ఆకట్టుకుంది. పరేడ్ మైదానంలో అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన కార్యక్రమాలు సందర్శకుల్లో ఉత్సాహాన్ని నింపాయి. విద్యుత్ ధగధగలు, బాణసంచా వెలుగుల్లో ట్యాంక్‌బండ్ పరిసరాలు కళకళలాడాయి. వర్షం కురిసినప్పటికీ తడుస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ రాధాకృష్ణన్ కూడా ఈ కార్యక్రమాలను వీక్షించారు. కాగా, నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో జెండా ఎగురవేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ అమరుల త్యాగాలు, సకల జనుల పోరాటంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాను నంబర్ 1 స్థానంలో నిలిపేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



డప్పు కళాకారుల విన్యాసం



వేదికపై కళాకారుల నృత్యం



పరేడ్‌మైదానంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం తదితరులు



గన్‌పార్క్‌లో నివాళి అర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి



కమాండ్ కంట్రోల్‌రూంలో జెండా వందనం చేస్తున్న జాయింట్ సీపీ అడ్మిన్ పరిమళ హానా నూతన్



సైబరాబాద్ కమిషనరేట్‌లో మాట్లాడుతున్న సీపీ అవినాష్ మహంతి



జాతీయ జెండా వందనం చేస్తున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి



వేడుకలకు హాజరైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

అమరవీరులకు ఉద్యమకారుల నివాళులు 8

వచ్చేనెల 7నుంచి ఆషాఢ బోనాలు





ఆదివారం పగటి ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు సాయంత్రం కురిసిన వర్షంతో తడిసిముద్దయ్యారు. ప్రధానంగా కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కూకట్‌పల్లిలో కురిసిన వర్షానికి మునిగిన రహదారి, వానలో ఆగిన బండితో వాహనదారుడి తిప్పలు చిత్రాల్లో చూడొచ్చు.

ఎండల తీవ్రత.. ధరల మోత..!

- మళ్లీ పెరిగిన కూరగాయల రేట్లు
- పది రోజులతో పోల్చితే 30 శాతం అధికం
- చికెన్ లైవ్ కిలో రూ.190, స్కిన్‌లెస్ రూ.290-300
- సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరాఘాతం

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో కూరగాయల ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. రూ.100కు కనీసం రెండు మూడు రకాల కూరగాయలు కూడా రావడం లేదని సామాన్యులు వాపోతున్నారు. పెరిగిన ఎండల తీవ్రతతో దిగుబడులు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి.

పప్పుల ధరలకు తోడు..

ఇప్పటికే పప్పుల ధరలు బాగా పెరిగాయి. రిటైల్ దుకాణాల్లో కందిపప్పు కిలో రూ.190, మినపప్పు రూ.150, శనగపప్పు రూ.80 ఉన్నాయి. ఇప్పుడు కూరగాయల



రేట్లు గుబులు పుట్టిస్తున్నాయి. పది రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చితే 20 నుంచి 30 శాతం అదనంగా పెరిగాయి. ఉదాహరణకు మే 23న రిటైల్ మార్కెట్‌లో కిలో టమాట రూ.25 ఉండగా,

మిగతా 8వ పేజీలో..

- అభ్యర్థులు, పార్టీ నేతల్లో టెన్షన్
- సాధారణ పౌరుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు చర్చ
- అప్పుడే మొదలైన విశ్లేషణలు
- ఎగ్జిట్ పోల్స్‌తో వేడెక్కిన రాజకీయం

గెలుపెవరిదో?

రేపే ఓట్ల లెక్కింపు



మూడు వారాల క్రితం పోలింగ్.. ఇన్నాళ్లూ కూల్‌గా ఉన్న రాజకీయ వాతావరణం ఎగ్జిట్ పోల్స్ వెల్లడితో వేడెక్కింది. లెక్కింపు ముహూర్తం సమీపించడంతో మరింత ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతోన్న వేళ ఉద్యమస్మృతులు నెమరువేసుకుంటూనే.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై చర్చిస్తున్నారు. సాధారణ పౌరుల నుంచి పార్టీల నేతలు, పారిశ్రామికవేత్తల వరకు గెలుపెవరిది..? ఏ పార్టీ ఎక్కడ గెలిచే అవకాశముంది..? ఏ స్థానంలో ఎవరు గెలుస్తారు..? ఏ ఎగ్జిట్ పోల్ వాస్తవం కానుంది..? గతంలో ఆయా సంస్థలు చేసిన సర్వేలు ఎంత వరకు నిజమయ్యాయి..? అనే అంశాలే చర్చకు వస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల్లో నిక్షిప్తమైన భవితవ్యం రేపు వెల్లడి కానున్న నేపథ్యంలో పార్టీల కీలక నేతలు, అభ్యర్థులు, వారి అనుచరులు.. కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది. పలు స్థానాలకు సంబంధించి మెజార్టీ సర్వే సంస్థలు ఏ పార్టీ విజయం సాధించే అవకాశముందన్నది ప్రకటించినా.. ఆ పార్టీల అభ్యర్థులూ ధీమాగా కనిపించడం లేదు. ఫలితాలు వెల్లడైతే తప్ప ఏం జరుగుతుందో చెప్పడం కష్టమని ప్రధాన పార్టీ అభ్యర్థి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. రేపు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. ఐదారు రౌండ్లలో ట్రెండ్ తెలిసే అవకాశముందని, ఏ లోక్‌సభ స్థానం లో ఏ పార్టీ/అభ్యర్థి గెలిచే అవకాశముందన్న దానిపై దాదాపుగా అంచనాకు రావచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు కీలకంగా మారాయి. కౌంటింగ్ పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా ప్రభుత్వ విభాగాలు ఏర్పాట్లు చేశాయి.

గతంలో తలా ఒకటి..

మహానగరం పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. 2019లో బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం తలో స్థానం దక్కించుకున్నాయి. ఈసారి రాజకీయ పరిణామాలు భిన్నంగా ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. గెలుపు కోసం

మిగతా 8వ పేజీలో..

ఎగ్జిట్‌పోల్స్‌తో ఆశల పల్లకిలో కమలం 8



నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ట్రై కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలతో పాటు, సిటీ కమిషనరేట్ పరిధిలో జరిగిన కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ట్రై కమిషనరేట్ సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అవినాశ్ మహంతి, తరుణ్‌జోషి తెలిపారు. పటిష్టమైన నిఘా, పోలీస్ బందోబస్తు మధ్య లెక్కింపు జరగనున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత, బందోబస్తును ట్రై కమిషనరేట్ సీపీలు ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నారు.

24 గంటలు.. 144 సెక్షన్

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం లెక్కింపు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీలు వెల్లడించారు. మూడంచెల భద్రతలో భాగంగా మొదటి వలయంలో కేంద్ర ఆర్మీ బలగాలు, రెండో దశలో తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్, మూడో వలయంలో నగర పోలీసులు ఉంటారు. మొత్తంగా ఒక్కో కేంద్రం వద్ద 130 నుంచి 150 మంది అదనపు కమిషనర్, డీసీపీ, ఏసీపీ స్థాయి పోలీస్ అధికారులు,

మిగతా 6వ పేజీలో..

ఐపీఎల్ 'కావ్య'ం

ఈ ఐపీఎల్ సీజన్‌లో.. కోల్‌కతా రైడర్స్ యజమాని షారుక్ ఖాన్ కంటే సోషల్ మీడియాలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యజమాని కావ్య మారన్ పాపులరైంది. ఐపీఎల్ ఆద్యంతం.. క్రికెట్ గ్రౌండ్‌లోని కెమెరాల లెన్సులన్నీ ఆమె హావభావాలను ఒడిసిపట్టాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆమె కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యం క్రికెట్ ప్రేమికుల్ని కదిలించింది. ఈ ఏడాది 'నేషనల్ క్రష్' అయిన కావ్య మారన్ కథేంటీ?

ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో.. కెమెరా కంట ముఖం పడకుండా వెనక్కి తిరిగి మరీ కన్నీళ్లు పెట్టుకున్న ప్రెట్టీ యంగ్ లేడీని చూసి నిజంగా ఫీలయ్యానంటూ... బిగ్ బి అమితాబ్ బచ్చన్ 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. దాదాపు అందరి అభిప్రాయమూ ఇదే. కావ్య మారన్ నవ్వితే.. నవ్వారు. ఆమె హావభావాలు చూడటం కోసం ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఫైనల్ మ్యాచ్‌లో భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయిందీ అధినేత. తన జట్టు ఓడినా.. ప్రేక్షకుల మనసు మాత్రం గెల్చుకుంది.

ఎవరీ కావ్య మారన్?

సన్‌గ్రూప్ అధినేత కళానిధి మారన్ ఒకే ఒక్క గారాల పట్టి కావ్య మారన్. 19వేల కోట్ల సామ్రాజ్యానికి ఆమె ఒకే ఒక్క రాకుమారి. క్రికెట్ అంటే అమితమైన ప్రేమ ఉండే కావ్య..



ఫ్రాంచైజీ యజమానిగా వ్యవహరిస్తోంది. 409 కోట్ల నికర సంపద ఆమె సొంతం. ఒకే ఒక్క కూతురు.. వేల కోట్ల సామ్రాజ్యం. సన్‌మ్యూజిక్ సంస్థతో పాటు సన్‌రైజర్స్ ఫ్రాంచైజీకి సీఈవోగా బాధ్యతలు వ్యవహరిస్తోంది. 2018లో ఐపీఎల్ బాటలోకి వచ్చిన పేరున్న క్రికెటర్లతో జట్టును కూర్చింది. కోట్ల రూపాయలు వెచ్చించి వేలంలో చేజిక్కించుకుంది. గత సీజన్స్‌లో ఎస్ఆర్‌హెచ్ వెనక్కి పడిపోవటంతో విమర్శలూ మూటగట్టుకుంది. అయినా పట్టువదలకుండా ఈసారైనా తన జట్టును గెలిపించుకోవాలని వ్యూహరచన చేసింది. అయితే ఈ ఏడాది ప్రకృతి కావ్య రచన మరోలా ఉంది. జట్టు విజయాపజయాలు అనేది సాధారణ విషయమైనా.. ఆమె కన్నీళ్లు మాత్రం నిజాయితీతో కూడుకున్నవి కాబట్టే ప్రేక్షకులతో పాటు విజేతల జట్టు కూడా ఎమోషనైంది.

అందుకే ఆమె క్రేజ్..

చెన్నయ్‌లోని 'స్టెల్లా మారిస్ కాలేజీ'లో డిగ్రీ చదివింది. యూకేలోని 'వార్విక్ బిజినెస్ స్కూల్'లో ఎంబీఏ చదివింది. దీంతో ఆమె తన తండ్రి స్థాపించిన సన్‌గ్రూప్‌ను మరింతగా అర్థం చేసుకుంది. దీంతో కళానిధి మారన్ తన బిడ్డను మరింతగా ప్రోత్సహించారు. ఎంతైనా.. తన వ్యాపార సామ్రాజ్యానికి వారసురాలు ఆమే కదా! కావ్య మారన్‌కు తోబుట్టువులు లేరు. దీంతో ఆమెను పాపం.. సింగిల్! అంటూ కొందరు మాట్లాడారు. ఆమె ఒంటరితనంతో ఉండకూడదని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ లాంటి పనులను అప్పచెప్పారు ఆమె పేరెంట్స్. కావ్య మారన్ వయసు ముప్పయ్ ఒకటి. ఆమధ్య మ్యూజిక్ దర్శకుడు అనిరుద్ బాయ్ ఫ్రెండ్ అని గాసిప్స్ వచ్చాయి. ఓ క్రికెటర్ ప్రేమలో పడిందని కోడైకూసారు. అవేమీ నిజం కాదని తేలింది. పైగా ఆమె సింగిల్ కావట... కథానాయికలా ఆమె చూపులు.. నవ్వు.. ఉల్లాసంగా గెంతులేయటం, బంతి బంతికీ ఉత్కంఠ, ప్రతి సిక్స్‌కూ కేరింత చేయటంతో మీడియా ఆమె గురించి కథనాలు ప్రసారం చేసింది. సోషల్ మీడియా నెత్తికెత్తుకుంది. దీంతో 'నేషనల్ క్రష్' అయింది కావ్య.

ఆశావహదృక్పథానికి నెటిజన్ల ఫిదా!

ఫైనల్‌లో ఓడిపోయాక తన జట్టు సభ్యులతో కావ్య మాట్లాడిన వీడియోను సన్‌రైజర్స్ సంస్థ విడుదల చేసింది. 'అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతి ఒక్కరూ బాగా ఆడారు. మన గురించి అందరూ మాట్లాడుకుంటారు' అంటూ కావ్య మారన్ తన జట్టులో ధైర్యాన్ని నింపింది. ఓడిపోయామన్న బాధను దిగమింగుకుని.. జట్టు సభ్యులను నవ్వించింది. దీంతో నెటిజన్లు ఆమె మాటలకు ఫిదా అయ్యారు. ఆమె తీరును మెచ్చారు. నిజమైన లీడర్ అంటే 'కావ్య మారన్' అంటూ కొనియాడుతున్నారు. దటీజ్.. కావ్య మారన్!

అత్తమ్మ... ఆవకాయ



'అత్తమ్మ'గా తెలుగువారందరినీ 'ఫిదా' చేశారు.
యాభై ఎనిమిదేళ్ల వయసులో నటి అయ్యారు.
హుందాగల పాత్రల్లో నటిస్తూ... అతితక్కువ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.
దర్శకుడు తరుణ్ భాస్కర్ తల్లిగానే కాకుండా... కళాకారిణిగా... ఉపాధ్యాయురాలిగా... రచయితగా... బహుముఖ ప్రజ్ఞతో అందరికీ దగ్గరయ్యారు...
దాస్యం గీతాభాస్కర్.
అంతేకాదు... నలుగురినీ పిలిచి... ఆవకాయ పెట్టి... 'పచ్చడి పార్టీ' ఇచ్చి... మన సంస్కృతిని భావితరాలకు అందిస్తున్న ఆమెతో 'నవ్య' ముచ్చట్లు.

"చిన్నప్పటి నుంచి నాకు ఆర్ట్ అంటే చాలా ఇష్టం. అందుకే అప్లైడ్ ఆర్ట్ నేర్చుకున్నా. ఆ దారిలోనే నా కెరీర్‌ను కూడా నిర్మించుకోవాలని కలలు కన్నా. కానీ పెళ్లి తరువాత నా ప్రణాళికలన్నీ తలకిందులయ్యాయి. మావారు దాస్యం ఉదయ్‌భాస్కర్‌ది రాజకీయ నేపథ్యం గల పెద్ద కుటుంబం. ఆయన స్వస్థలం వరంగల్. విద్యార్థి నాయకుడిగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మాజీ సీఎం జలగం వెంగళరావు, మాజీ మంత్రి కడియం శ్రీహరి తదితరులు బాగా పరిచయం. మావారు వాటర్‌వర్క్స్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేసేవారు. వాళ్లు ఎనిమిది మంది సంతానం. ఆ ఇంటికి నేనే పెద్ద కోడల్ని. మా నాన్నావాళ్లది తిరుపతి సమీపంలోని వడమలపేట. అమ్మావాళ్లది ఊటీ. నేను పుట్టి పెరిగింది చెన్నైలో. 1987లో మా పెళ్లయ్యాక నా నివాసం హైదరాబాద్‌కు మారింది. మావారి కోసం నగరానికి ఎవరు వచ్చినా మా ఇంటికి వచ్చేవారు. బాధ్యతలు పెరగడంతో అనుకున్న కెరీర్ వైపు వెళ్లలేకపోయాను.

అయితే కొన్ని కారణాలవల్ల మావారు ఉద్యోగం వదిలేసి, కాంట్రాక్టులు మొదలుపెట్టారు. దాంతో కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎవరినో సాయం అడిగే కంటే నేనే ఏదైనా ఉద్యోగం చేయడం ఉత్తమం అనుకున్నా. మా నాన్న కూడా అదే చెప్పారు. తరుణ్ స్కూల్‌కు వెళ్లడం మొదలయ్యాక ఖర్చులు కూడా పెరిగాయి. వాడిని తీసుకొని బడికి వెళుతున్నప్పుడు... ఎవరైనా టీచర్ రాకపోతే నన్ను పాఠాలు చెప్పమనేవారు. తరువాత ఆర్ట్ టీచర్‌గా కొత్త అధ్యాయం ఆరంభమైంది.

ఎంతో నేర్పించవచ్చు...

పిల్లలు... వారి కల్మషం లేని మనసులు... అదొక అద్భుత ప్రపంచం. టీచర్‌గా అవన్నీ పొందగలిగాను. అప్పుడే అనిపించింది... ఆర్ట్ ద్వారా పిల్లలకు ఎంతో నేర్పవచ్చని. ఆర్టిస్ట్‌గా నాలో సృజనాత్మక శక్తి ఉంది. దానికి విజ్ఞానాన్ని, విలువలను జోడించి పిల్లలకు పాఠాలు చెబితే... సులువుగా అర్థమవుతుంది. వారి ఉన్నతమైన భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుంది. ఆర్ట్ అంటే ఏదో బొమ్మలు గీసి గోడ మీద తగిలించేది కాదు. దాని ద్వారా ఎన్నో విషయాలు నేర్పించవచ్చనేది నా బలమైన నమ్మకం. బొమ్మలతో చెబితే పిల్లలకు మెదడులో నాటుకుపోతుంది. దీనికి పాఠ్య పుస్తకం ఏమీ ఉండదు కనుక పిల్లలతో ఏ విషయం గురించి అయినా మాట్లాడగలుగుతాం. నా తరగతిలో బొమ్మలు వేయడమే కాదు... దానికి క్యాప్షన్లు కూడా ఆలోచించమంటాను. దీనికి సంబంధించి సొంతంగా ఆరు నెలల విజువల్ ఆర్ట్ కోర్సు ఒకటి తయారు చేశాను.

అవకాశం అప్పుడే వచ్చింది...

చెన్నైలో అడ్వర్‌టైజ్‌మెంట్స్ డిజైనింగ్‌లో పని చేశా. యానిమేషన్ నేర్చుకున్నా. కొన్ని చిత్రాలకు టైటిల్ యానిమేషన్ చేశాను. ఆ సమయంలోనే నాకు సినిమాలో నటించే అవకాశం వస్తే... మా అమ్మ వద్దని ఆపేసింది. భానుమతి గారు మా అమ్మావాళ్ల ఇంటికి వచ్చేవారట. శివాజీ గణేశన్ అదే వీధిలో ఉండేవారు. ఇలా సినీ పరిచయాలు ఉన్నా ఎందుకో మా అమ్మ అసలు ఆ వైపుకే వెళ్లద్దంది.

అక్కతో పోల్చడంతో...

మా ఇంట్లో నన్ను మా అక్కతో పోల్చేవారు. తను సన్నగా ఉండేది. అలాగే ఇంగ్లీష్ బాగా మాట్లాడుతుంది. అలా పోల్చడంవల్ల నాకు పట్టుదల వచ్చింది. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే తపనతో క్రాస్‌వర్డ్, జంబ్లింగ్ వర్డ్స్ పజిల్స్ పూరించేదాన్ని. పేపర్లో కనిపిస్తే ఇప్పటికీ చేస్తా. ఆంగ్లంలో కవితలు రాసేదాన్ని. నాతో పాటు మా అబ్బాయి తరుణ్ కూడా పజిల్స్ చేస్తాడు. అలా నా అంతట నేను ఇంగ్లీష్‌లో చాలావరకు మెరుగయ్యాను. చెన్నైలో పెరగడంవల్ల నాకు మొదట్లో తెలుగు కూడా వచ్చేది కాదు. ఇక్కడకు వచ్చాక నేర్చుకున్నా.

ఉద్యోగం వదిలేసి...

సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ కూడా తీసుకున్నా. దానికి చిత్రకళ జోడించి వర్క్‌షాప్స్ నిర్వహించాను. హెచ్‌పీఎస్‌లో పని చేసినప్పుడు... ఆర్ట్‌ను ఎప్పటిలా కాకుండా కాస్త మార్చాలని చెబితే, ఆ స్వేచ్ఛ నాకు ఇచ్చారు. 2007లో అక్కడ మానేశాను. ఎందుకంటే మా అబ్బాయి అప్పుడు సినిమాల్లో ప్రయత్నిస్తున్నాడు. ఇంటి పట్టున ఉండి వాడికి కావల్సినవి చూసుకోమని మావారు చెప్పడంతో ఉద్యోగం వదిలేశాను. ఇంగ్లీష్‌లో మరింత పట్టు సాధించడానికి ఈ



సమయాన్ని ఉపయోగిద్దామని అనుకున్నా. దాంతో నిజాం కాలేజీలో ట్రైనర్‌గా చేరాను. డాక్టర్ సురేష్ గారి ప్రోత్సాహంతో తరగుతులు తీసుకున్నాను. పార్ట్‌టైమ్ లాగా. టైమ్స్ ఆఫ్ ఇండియాలో కొన్ని రోజులు ఆర్ట్, ఇలస్ట్రేషన్, స్టోరీ రైటింగ్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. దానికి ముందు వేరేచోట పని చేశాను. అయినా ఎందుకో చిత్రకళతో కొత్తగా ఏదైనా చేయాలని అనుకున్నాను.

అలా ఉపయోగపడింది...

అనుకోకుండా 58 సంవత్సరాల వయసులో నాకు నటించే అవకాశం లభించింది. స్క్రీన్ ప్రెజన్స్‌తో మొదటి చిత్రం 'ఫిదా'తోనే మంచి గుర్తింపు దక్కింది. దర్శకుడు తరుణ్ భాస్కర్ వాళ్ల అమ్మ కావడం అదనపు అర్హత అయింది. ఈ గుర్తింపు నేను రూపొందించిన విజువల్ ఆర్ట్ కోర్సు గురించి వివరించడానికి స్కూల్స్‌కు వెళ్లినప్పుడు ఉపయోగపడింది. కనీసం నేను ఏం చెప్పదలుచుకున్నానో చెప్పడానికి నాకు ఒక అవకాశం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కోర్సుకు ప్రభుత్వం సర్టిఫికేషన్ ఇస్తానంది. ప్రస్తుతం ఇరవై కార్పొరేట్ స్కూల్స్‌లో ఈ విజువల్ ఆర్ట్ కోర్సు చెబుతున్నాం. పిల్లల్లో సృజనకు పదును పెట్టి, వారిలో ఆలోచనాశక్తి పెంపొందించడం, డ్రాయింగ్ ద్వారా సామాజిక, సాంస్కృతిక అంశాలు, విలువలు బోధించేలా పీపీ-1 నుంచి ఏడో తరగతి వరకు దీన్ని డిజైన్ చేశాను. పిల్లలు నిజాయతీగా, బాధ్యతగా పెరగడానికి ఇది దోహదపడుతుంది. ఈ క్రమంలో చిన్నారుల నుంచి నేను కూడా ఎన్నో నేర్చుకున్నాను.

సినిమాల్లో అలా మొదలైంది...

తరుణ్‌కు మొదటి నుంచీ కళాత్మక దృష్టి ఉండేది. ఎవర్ని చూసినా పోర్ట్రైట్ వేసేస్తాడు. అలాగని చిత్రలేఖనం నేర్చుకోలేదు. అంత ప్రతిభ నాకు కూడా లేదు. తరువాత సంగీతం కూడా అంతే. తబలా, మౌతార్గన్, గిటార్.. ఏ వాయిద్యం ఇచ్చినా వాయిస్తాడు. వాడిలో ఆ సంగీత జ్ఞానం ఉంది. కోచింగ్ కూడా లేకుండా ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీటు తెచ్చుకున్నాడు. ఇంజనీరింగ్ తరువాత ఎటు వెళ్లాలనేది వాడికే వదిలేశారు మావారు కూడా. అయితే వాడు కాలేజీలో చదువుతున్నప్పుడు షార్ట్ ఫిలిమ్ కాంపిటీషన్ జరిగింది. అందులో తల్లి పాత్రకు నన్ను తీసుకున్నాడు. 'నువ్వు ఇంట్లో ఎలా ఉంటావో అలానే కనిపించాల'ని అన్నాడు. అది చూసి శేఖర్ కమ్ముల గారు 'ఫిదా'లో అవకాశం ఇచ్చారు. మావారు చనిపోవడం, తరుణ్ 'పెళ్లి చూపులు' చిత్రం హిట్ అవ్వడం... భిన్నమైన భావోద్వేగ పరిస్థితుల్లో ఉన్నాను. షూటింగ్‌లో ఏడ్చినా, నవ్వినా ఎవరూ అడిగేవారు ఉండరని ఒప్పుకున్నా.

భగవంతుడు చూపిన మార్గం...

చూస్తుండగానే పన్నెండు చిత్రాల్లో నటించేశాను. ఇవికాకుండా యాడ్స్, వెబ్‌సిరీస్‌ల్లో నటించాను. శర్వానంద్ చిత్రంలో కూడా చిన్న పాత్ర చేశా. ఒక వెబ్ సిరీస్ పూర్తయింది. అయితే నటనను ఫుల్‌టైమ్‌గా తీసుకోదలుచుకోలేదు. తరుణ్ కూడా వద్దన్నాడు. అందుకే రెండు మూడు రోజులు షూటింగ్ ఉన్నవే ఒప్పుకొంటున్నా. డబ్బింగ్ కూడా నేనే చెబుతున్నా. అదికూడా సాయిపల్లవి వల్లే. 'ఫిదా'లో నా పాత్రకు వేరేవాళ్లతో చెప్పిస్తే తను ఒప్పుకోలేదట. కళ పట్ల ప్రేమ ఉండటంవల్ల బహుశా భగవంతుడు నాకు ఈ మార్గం చూపించాడేమో అనిపిస్తుంది. పరిశ్రమలో ఎంతో మంది సీనియర్ నటులతో పాటు నన్ను కూడా గుర్తుపడుతున్నారు. నిజంగా ఇది మధురానుభూతి.

కాలం మారుతుంది...

మా ఆర్థిక పరిస్థితి దిగజారిన తరువాత నాకు ధైర్యం ఇచ్చినవారు లేరు. 'ఈ కాలం మారుతుంది' అని ఎప్పటికప్పుడు నాకు నేనే చెప్పుకొనేదాన్ని. తరుణ్‌ను తీసుకొని స్కూటీ మీద స్కూల్‌కు వెళుతున్నప్పుడు ఎందుకు అనుకున్నానో తెలియదు, కానీ గట్టిగా అనుకున్నా... 'లైఫ్ విల్ నాట్ బి ద సేమ్' (జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు) అని. పొద్దున్నే లేవడం... ఇంటి పనులు చేసుకోవడం... ఇదే నా బలం. దానివల్ల ఫీల్ గుడ్ హార్మోన్ అంటారు కదా... అలా అనిపిస్తుంది. మన ఇంటి పనులు మనం చేసుకొంటే ఎంత ఆరోగ్యంగా ఉంటాం! అలాగే మధ్యలో వదిలేసిన పెయింటింగ్స్ మళ్లీ మొదలుపెట్టాలి. ఇంకో పుస్తకం రాయాలి. ఇంతకు మించి నాకు వేరే కోరికలేమీ లేవు.

పచ్చడి పార్టీ...

మావారికి పచ్చళ్లంటే చాలా ఇష్టం. వాళ్ల వైపు వంటలు కాస్త ప్రత్యేకంగా ఉంటాయి. వాటికి భిన్నంగా వండితే నచ్చదు. అలానే ఆవకాయ పచ్చడి కూడా... అల్లం, వెల్లుల్లితో చేసేదే కావాలనేవారు. అదికూడా వంద కాయలతో పెట్టాలి. అందరికీ పంచాలి. ఆవకాయ పెట్టి, జాడీల్లోకి సర్దాక పచ్చడి కలిపిన గిన్నెలో అన్నం కలిపి అందరికీ పెట్టేదాన్ని. తరుణ్ అయితే వాళ్ల స్నేహితులందరినీ పిలిచి 'పచ్చడి పార్టీ' అని మొదలుపెట్టాడు. 'ఆవకాయ అంటే పెద్ద ప్రక్రియ. పచ్చళ్ల పెట్టడం మన సంస్కృతిలో భాగం. సీజన్‌లో అమావాస్య తరువాత పంచమి రావాలి. ఒక వర్షం అయిపోయాక, కొన్ని రోజులు ఆగాలి. మేలి రకం మామిడి కాయలు తెప్పించాలి. ఇలా ఎన్నో విషయాలు చూసుకోవాల'ని ఆ మధ్య ఓ కార్యక్రమంలో చెప్పాను. దాంతో వాళ్లు మా ఇంటికి వచ్చి పచ్చడి మీద డాక్యుమెంటరీ తీశారు. అలాగే మా ఆర్ట్ స్కూల్ వార్షికోత్సవంలో కూడా 'పచ్చడి పార్టీ' పెట్టా. నలుగురినీ పిలిచి పచ్చడి పెట్టడమంటే అందులో మన సంస్కృతి ప్రతిబింబిస్తుంది."

● హనుమా

సాయిపల్లవితో స్నేహం...

'ఫిదా' తరువాత హీరోయిన్ సాయి పల్లవితో మంచి స్నేహం ఏర్పడింది. మొన్న కూడా తన పుట్టిన రోజుకు శుభాకాంక్షలు చెబితే... 'అత్తమ్మా...' అంటూ పలుకరించింది. ఇప్పటికీ తను నన్ను 'అత్తమ్మ' అనే పిలుస్తుంది. నేను తనను 'భాను' అనే అంటాను. 'ఫిదా'లో మా ఇద్దరి పాత్రలు కదా అవి. అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుంటా. మెసేజీలు పెడుతుంటా. తన ప్రాజెక్ట్ ఏదైనా ఉంటే అభినందలు పంపుతుంటా. ఆమె చాలా ఫ్లెక్సిబుల్. ఎనర్జటిక్. 'ఫిదా' షూటింగ్‌లో పెళ్లి సన్నివేశం ఉంటుంది. తను తరువాతి షాట్‌కు రెడీ కావాలి. అప్పుడు ప్రొడక్షన్‌వాళ్లు ఆలస్యం చేస్తుంటే... తనే చీపురు తీసుకొని ఊడ్చేసింది. పాటలో మెహిందీ సన్నివేశం కోసం... తను కూడా కోన్ పట్టుకొని మెహిందీ పెట్టేసింది. అసమాన ప్రతిభగల నటి సాయిపల్లవి.



నా ఆరోగ్య రహస్యం...

మా వారి ప్రోత్సాహంతో గతంలో నేను ఒక పుస్తకం రాశాను. ఆయన ఎప్పుడూ చెప్పేవారు... పిల్లల పెంపకం మీద పుస్తకం రాయమని. అందుకే రాశాను. మా అబ్బాయి తరుణ్ భాస్కర్ నా కడుపులో ఉన్నప్పటి నుంచి వాడి విషయంలో ఆయన చాలా శ్రద్ధ తీసుకున్నారు. అప్పుడు వాంతులతో నేను బాగా ఇబ్బంది పడ్డాను. కానీ నా కంటే పుట్టబోయే బిడ్డ గురించే ఆయన ఎక్కువ పట్టించుకున్నారు. 'నాకు కొడుకే పుడతాడు' అని ఆయనకు నమ్మకం. అలానే ముగ్గులు వేసే అమ్మాయే తనకు భార్యగా వస్తుందని అందరూ మావారిని ఆట పట్టించేవారట. ఎందుకంటే ఈ కాలంలో ముగ్గులు వేసే అమ్మాయిలు ఎక్కడో కానీ లేరనేది వారి అభిప్రాయమట. నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు మా వాకిట్లో ముగ్గు చూసి మావారికి నా మీద ఒక సదభిప్రాయం వచ్చేసిందట. నేను ఇప్పటికీ రోజూ ఇంటి ముందు ముగ్గులు వేస్తాను. పొద్దున్నే 3.50కి నిద్ర లేచి, ఇంటి పనులన్నీ చేసుకోవడం చిన్నప్పటి నుంచి అలవాటు. స్నానం అయ్యాక ఇల్లు ఊడ్చి, తుడుస్తా. అంటే భూమాతకు పూజ చేసినట్టు. చిన్నప్పుడు నేను బాగా లావుగా ఉండేదాన్ని. 'ఇంటి పని చేస్తే కొవ్వు కరుగుతుంది. నడుము బలంగా మారుతుంది' అని మా తాత చెప్పేవారు. దాన్ని ఈ రోజుకూ పాటిస్తున్నా. అదే నా ఆరోగ్య రహస్యం కూడా.

నవ్య | చిత్రజ్యోతి

అప్పుడే సీక్వెల్ చేద్దామన్నా



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. శంకర్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. జూలై 12న ఈ సినిమా విడుదలవుతోంది. చెన్నైలో ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ "1996లో 'భారతీయుడు' వచ్చిన టైమ్‌లోనే ఈ సినిమా సీక్వెల్ గురించి డైరెక్టర్ శంకర్‌తో మాట్లాడాను. కానీ శంకర్ మాత్రం కథ రెడీగా లేదని అన్నారు. 28 ఏళ్ల తర్వాత అయినా ఈ సినిమాకు సెకండ్ పార్ట్ వస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "మొదటి పార్ట్‌కు మించి సీక్వెల్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని శంకర్ అన్నారు. గొప్ప సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని సుభాస్కరన్ చెప్పారు.

కొత్త శర్వాని చూస్తారు



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన చిత్రం 'మనమే'. టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 7న విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ ఆదిత్య మీడియాతో ముచ్చటించారు.

"అందమైన అనుభూతులను పంచే కథ ఇది. పేరెంటింగ్ ఎమోషన్‌కు హాస్య కోణాన్ని జత చేసి ఈ సినిమాను తెరకెక్కించా. ఇందులో శర్వానంద్‌ది చాలా కూల్ మనస్తత్వం. ఇప్పటివరకూ చూడని శర్వాని ఇందులో చూస్తారు. కృతిశెట్టి ఈ సినిమాలో నేను ఊహించిన దానికన్నా బాగా నటించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమాలో ఉన్న 16 పాటలు సందర్భానుసారం ఉంటాయి" అని చెప్పారు.

అటు పాట... ఇటు వేట




ధనుష్ టైటిల్ రోల్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు 'ఇళయరాజా' బయోపిక్ తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నేడు ఇళయరాజా పుట్టిన రోజు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ ధనుష్ ఈ చిత్రం నుంచి పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. స్టేజిపైన హార్మోనియం పెట్టెతో జనాలను చూస్తూ నిల్చొని ఉన్న ధనుష్ లుక్ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి అరుణ్ మాథేశ్వరన్ దర్శకుడు. అలాగే ధనుష్, నాగార్జున కథానాయకులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న కుబేర చిత్రం మెయిన్ యాక్షన్ షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా లొకేషన్‌లో యూనిట్‌కు సూచనలు ఇస్తున్న శేఖర్ కమ్ముల స్టిల్‌ను చిత్రబృందం పంచుకొంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక.

అందరికీ నచ్చుతుంది



యానియా, అంకిత, అజయ్, కబీర్ సింగ్ ప్రధాన పాత్రలలో తెరకెక్కిన చిత్రం 'ఇంద్రాణి'. ఈ సూపర్ ఉమెన్ సినిమాను స్టీఫెన్ పల్లం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. స్టీఫెన్ పల్లం మాట్లాడుతూ "ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. టాప్ క్లాస్ వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రేక్షకులని అలరిస్తుంది. వందేళ్ల తర్వాత ప్రపంచంలో ఎలాంటి టెక్నాలజీ అందుబాటులో ఉంటుందో చూపించాం. అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. కబీర్ సింగ్ మాట్లాడుతూ "సినిమాని విజువల్ వండర్‌లా డైరెక్టర్ తీర్చిదిద్దారు. ఇందులో సూపర్ విలన్‌గా నటించాను" అని చెప్పారు.



శ్రీవిష్ణు, రీతూవర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మీరాజాస్మిన్ రాణి ఉత్పలాదేవిగా కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఆదివారం లుక్‌ను విడుదల చేశారు.

వినోదం సందేశం కలబోతగా



హరీష్ బొంపెల్లి, మాన్య సలాడీ హీరో హీరోయిన్లుగా విష్ణు బొంపెల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓసీ'. బీవీఎస్ నిర్మాత. ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మురళీ మోహన్ ఆవిష్కరించి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సినిమా కోసం టీమ్ అంతా చాలా కష్టపడింది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది అని దర్శకుడు చెప్పారు. సరికొత్త కథాంశంతో దర్శకుడు తెరకెక్కించారు, వినోదంతో పాటు మంచి సందేశం ఉంది అని నిర్మాత చెప్పారు. అవకాశాల కోసం వెళ్లి అవమానాల పాలైన దశ నుంచి ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకొస్తున్నందుకు ఆనందంగా ఉందని హరీష్ బొంపెల్లి తెలిపారు.

ప్రేమా? ఆకర్షణా?



సుదీష్ వెంకట్, అంకిత సాహ, శ్రేయాసి షా హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'పేషన్'. అరవింద్ జోషువా దర్శకత్వంలో డాక్టర్ అరుణ్‌కుమార్ ఎం, నరసింహ, ఉమేష్ నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మాట్లాడుతూ "ఫ్యాషన్ ప్రపంచానికి సంబంధించి, ఒక సమగ్రమైన సాంకేతిక పరిజ్ఞానంతో తెరకెక్కుతున్న తొలి భారతీయ సినిమా "పేషన్" అన్నారు. ప్రేమ, ఆకర్షణకు సంబంధించి యువతలో ఉన్న అనేకమైన ప్రశ్నలకు ఈ సినిమాలో జవాబు దొరుకుతుందని నిర్మాతలు పేర్కొన్నారు.

పోరాట ఘట్టాలు అలరించేలా



దర్శక నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'దీక్ష'. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయిన సందర్భంగా రామకృష్ణ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ 'భారీ యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ. కిరణ్ చేసిన స్టంట్స్ హైలైట్ అవుతాయి' అన్నారు. దీక్షతో కృషి చేస్తే ఏదైనా సాధించగలం అనే అంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోందని కిరణ్ కుమార్ అన్నారు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాతలు పినిశెట్టి అశోక్ కుమార్, మదాడి కృష్ణారెడ్డి చెప్పారు.


గన్‌పార్క్ వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు, అధికారులు


రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



అమరుల ఆశయాల బాటలో..

(మొదటిపేజీ తరువాయి)

కలను నిజం చేసిన నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి తెలంగాణ సమాజం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ.. అందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు" అని సీఎం అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మొదటి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని, ఈ దినోత్సవానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. సంక్షేమం ముసుగులో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టాలని చూస్తే తెలంగాణ సహించదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, 'తెలంగాణ అమాయకపు నెరజాణే కానీ.. అన్యాయం జరిగితే తిరగబడే నైజం కూడా మనకు ఉంది' అని దాశరథి అన్న మాటలను సీఎం రేవంత్ గుర్తు చేశారు. కాళోజీ చెప్పినట్లుగా, " ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే పొలిమేరల వరకు తరిమికొడతాం.. ప్రాంతం వాడే ద్రోహం చేస్తే ప్రాణాలతోనే పాతిపెడతాం" అన్న మాటలు అక్షర సత్యాలన్నారు.

సంస్కృతే జాతికి అస్తిత్వం..

రాష్ట్ర సంపదను పెంచి, పేదలకు పంచడానికి ఆర్థిక పునరుజ్జీవనం జరగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ అన్నారు. తాము అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉందని, రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని అన్నారు. తాము ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తూనే.. సంక్షేమం, అభివృద్ధిలో రాజీపడకుండా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఏ జాతికైనా తన సంస్కృతే తన అస్తిత్వమని, ఆ సంస్కృతిని కాపాడడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై.. వచ్చి పదేళ్లయినా.. రాష్ట్ర గీతం లేదని, ఉద్యమకాలంలో ఉవ్వెత్తున స్ఫూర్తిని రగిలించిన, సహజకవి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా సగర్వంగా ప్రకటిస్తున్నామని వెల్లడించారు. సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఇది తొలి అడుగు అని పేర్కొన్నారు. ఇక దావోస్ పర్యటనలో భాగంగా రూ.40 వేల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని, ఇది పెట్టుబడుల ఆకర్షణలో రికార్డు అని వెల్లడించారు. తెలంగాణ తల్లి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉండాలని, ఆ తల్లిని చూస్తే కన్నతల్లి యాదిలోకి రావాలని రేవంత్ వ్యాఖ్యానించారు. సగటు తెలంగాణ గ్రామీణ మహిళ రూపమే.. తెలంగాణ తల్లి ప్రతిరూపంగా ఉండాలన్నారు. తెలంగాణ తల్లి కష్టజీవి, కరుణామూర్తి అని, ఈ రూపురేఖలతో తెలంగాణ తల్లి రూపానికి పునరుజ్జీవనం జరగాలని అన్నారు. ఈ మేరకు తెలంగాణ తల్లి రూపం సిద్ధమవుతోందని ప్రకటించారు. ఇక చిహ్నం అంటే ఒక జాతి చరిత్రకు అద్దం పడుతుందని, జాతి చరిత్ర మొత్తం చిహ్నంలో నిక్షిప్తమై ఉంటుందని చెప్పారు. తెలంగాణ అంటే ధిక్కారం, పోరాటమని, ఇవి రాష్ట్ర అధికారిక చిహ్నంలో ప్రతిబింబించాలని గుర్తు చేశారు. ఆ దిశగానే ప్రభుత్వం నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉందన్నారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని నూతన చిహ్నాన్ని రూపొందించే పనిలో ఉన్నామన్నారు. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు, సంస్థల సంక్షిప్త పేర్లు, వాహన రిజిస్ట్రేషన్లలో రాష్ట్రాన్ని సూచించే సంక్షిప్త అక్షరాలుగా 'టీజీ' ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉద్యమ సమయంలో 'టీజీ'నే రాష్ట్ర సంక్షిప్త అక్షరాలుగా ప్రజలు నిర్ధారించుకున్నారని, యువత తమ గుండెలపై పచ్చబొట్లుగా వేయించుకున్నారని, వారి ఆకాంక్షల మేరకే 'టీజీ'ని పునరుద్ధరించామని తెలిపారు.

ప్రపంచానికి తెలంగాణ దిక్సూచి కావాలి..

తెలంగాణ రాష్ట్రం.. ప్రపంచానికే ఒక దిక్సూచి కావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. "తెలంగాణ విజయ పతాక దేశ విదేశాల్లో సగర్వంగా ఎగరాలి. పల్లె కన్నీరు పెడుతుందో అని ఒక నాడు ఆవేదనతో పాడిన తెలంగాణ పల్లెల్లో.. ఇకపై పచ్చని పైరులతో, పాడి పంటలతో రైతుల ముఖాలు చిరునవ్వుతో వెలగాలి. ఒకనాడు పొట్ట చేతపట్టుకుని పట్నం వచ్చిన యువత.. రేపటి నాడు ప్రపంచానికి మన సత్తా చాటే శక్తిగా మారాలి. తెలంగాణ ఇతర రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంతో పోటీ పడుతుందని నిరూపించాలి. ప్రపంచ నంబర్‌వన్ బ్రాండ్‌గా హైదరాబాద్ ఎదగాలి. తెలంగాణను ప్రపంచానికి డెస్టినేషన్‌గా మార్చాలన్న తపన ఉంది. ఆ దిశగా నాలుగు కోట్ల మంది ప్రజల ఆశీస్సులతోపాటు, రాజకీయ, పరిపాలన, పత్రికా, న్యాయ, సామాజిక వ్యవస్థల సహకారం కావాలి. ప్రజా ప్రభుత్వానికి మీ సంపూర్ణ సహకారం అందించాలి" అని రేవంత్ అన్నారు. తమ ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో భవిష్యత్తుకు పునాదులు వేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే మొత్తం తెలంగాణకు 'గ్రీన్ తెలంగాణ-2050 మాస్టర్ ప్లాన్'ను తయారు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించబోతున్నట్టు ప్రకటించారు.

మూసీ సుందరీకరణ

మూసీని సుందరీకరించి.. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో ఉంచుతామని సీఎం రేవంత్ ప్రకటించారు. మూసీ సుందరీకరణ పథకం ద్వారా పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్‌గా తీర్చిదిద్దబోతున్నామని, ఇందుకోసం ఇప్పటికే రూ.1000 కోట్లను కేటాయించామని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ఈ పథకం మరో స్థాయికి తీసుకెళ్లతుందన్నారు. పర్యాటకం, ఆర్థికం, పర్యావరణం అనే మూడు కోణాలు ఈ పథకంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మెట్రో విస్తరణ ప్రణాళికలనూ ప్రకటించామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రయత్నిస్తామని, తక్కువ ఖర్చుతో ఎక్కువ నీరు ఇవ్వగలిగే సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ అనే మాట వినిపించకుండా సంకల్పం తీసుకున్నామని రేవంత్ చెప్పారు. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని, ఇందుకోసం 'టీ న్యాబ్'కు పూర్తి సహకారం, స్వేచ్ఛతో పాటు అవసరమైన నిధులను కూడా ఇస్తున్నామని వెల్లడించారు.



ఇది ప్రజాపాలన..

పాలన ప్రజల దగ్గరకు చేరాలన్నది తమ ఆలోచన అని సీఎం రేవంత్ అన్నారు. అధికారంలోకి రాగానే.. ఇందిరమ్మ గ్రామ సభల ద్వారా అభయ హస్తం గ్యారెంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించామని, మొత్తం కోటి 28 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో డూప్లికేట్ పోగా.. కోటి 9వేల దరఖాస్తులు తేలాయని వెల్లడించారు. వీటిని పరిష్కరించే ప్రక్రియ నడుస్తోందన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, 30 వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చామని, మెగా డీఎస్సీ నిర్వహణకూ నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అర్హతకు వయోపరిమితిని 46 ఏళ్లకు పెంచామని గుర్తు చేశారు. రాష్ట్రంలోని పేదల సొంతింటి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం ముందుకువెళ్తుందని రేవంత్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ ఒక్క ఏడాదే రూ.22,500 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున దాదాపు 4.50 లక్షల ఇళ్లను నిర్మించబోతున్నామన్నారు. రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.1,135 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని 50 ఐటీఐలలో సాంకేతిక నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు టాటా గ్రూప్‌తో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. రైతును రాజు చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ అన్నారు. గతంలో రైతులకు ఉచిత విద్యుత్తు, రుణమాఫీ చేసిన చరిత్ర తమదేనని, ఆ ట్రాక్ రికార్డును కొనసాగిస్తామని తెలిపారు. ఆర్థిక సాయంలో భాగంగా 69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,500 కోట్లను జమ చేశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం అందించామని పేర్కొన్నారు. ఇక ధాన్యం సేకరణ కోసం 7,245 కేంద్రాలను ఏర్పాటుచేశామని, ఎలాంటి షరతులు లేకుండా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేశామని తెలిపారు. ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం..

పదేళ్ల పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైందని సీఎం రేవంత్ అన్నారు. భౌతిక విధ్వంసంతోపాటు తెలంగాణ మూల స్వభావమైన స్వేచ్ఛపై దాడి జరిగిందని తెలిపారు. సామాజిక న్యాయం మేడిపండు చందంగా మారిందని, ప్రజలందరికీ చెందాల్సిన రాష్ట్ర సంపద గుప్పెడు మంది చేతుల్లోకి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు కూడా విధ్వంసానికి గురయ్యాయన్నారు. 2014 జూన్ 2నాడు తెలంగాణ భౌగోళిక ఆకాంక్ష నెరవేరిందని, కానీ.. ఉద్యమ లక్ష్యాలు, అమరుల ఆశయాలు సాధించిన నాడే తెలంగాణ సాధనకు సార్థకత దక్కుతుందన్నారు. దశాబ్దకాలం అనేది ఒక మైలురాయి అని, చరిత్రను సమీక్షించుకున్నప్పుడే భవిష్యత్తుకు పునాదులు వేసుకోగలమని చెప్పారు. తమ ప్రజాపాలనలో స్వేచ్ఛ పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యం ఇచ్చామని రేవంత్ అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజలకు అందుబాటులో ఉండే పాలనను తెచ్చామని, తాము సేవకులం తప్ప.. పాలకులం కాదన్న నిజాన్ని నిరూపించామని అన్నారు. ఇందిరాపార్కులో ధర్నాచౌక్‌కు అనుమతి, మీడియాకు స్వేచ్ఛ ఇవ్వడంతో పాటు, ప్రతిపక్షానికీ గౌరవం ఇచ్చామని తెలిపారు. అంతేకాకుండా తమ నిర్ణయాల్లోని లోటుపాట్లపైనా సమీక్షకు అవకాశం ఇస్తున్నామని పేర్కొన్నారు.

ఉమ్మడి రాజధానికి కాలం చెల్లింది..

ఏపీ, తెలంగాణకు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ప్రకటించిన గడువు ఆదివారంతో పూర్తయిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే తెలంగాణ ముందు పలు సవాళ్లు ఉన్నాయని, కృష్ణా, గోదావరి జలాల్లో మన లెక్క తేల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పదేళ్లయినా నీటి పంపకాలు జరగలేదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి త్వరగా నీటి వాటాలు సాధించుకుని, సాగునీటి ప్రణాళికలను సమర్థంగా అమలు చేసుకోవాలన్నది తమ ఆలోచన అని చెప్పారు. అంతేకాకుండా ఏపీతో ఆస్తుల విభజనకు సంబంధించిన సమస్యలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకుంటామన్నారు.


అసెంబ్లీలోని గాంధీ విగ్రహం వద్ద స్పీకర్, మండలి చైర్మన్, మంత్రులు

అందెశ్రీ భావోద్వేగం

'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' గీతాన్ని రాష్ట్ర అధికార గీతంగా ప్రకటిస్తూ సీఎం.. రెండున్నర నిమిషాల నిడివిగల గీతాన్ని ఆవిష్కరించి, జాతికి అంకితం చేశారు. తాను రాసిన పాట.. దాదాపు పదేండ్ల తరువాత అధికారిక గీతంగా, జాతికి అంకితమైన వేళ.. కవి అందెశ్రీ భావోద్వేగానికి లోనయ్యారు. అందరూ ఆ గీతాన్ని వింటున్న సమయంలో.. ఆయన రెండు కళ్లు చెమర్చాయి. అదే సమయంలో ఆయన పిడికిలి బిగించి 'జై తెలంగాణ' అంటూ నినదించారు.

అమరులకు సీఎం నివాళులు

ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాంపల్లి గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ పదేళ్ల పండుగ సంబరాలు నగరంలో అంబరాన్నంటాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉద్యమకారులు, ప్రజాసంఘాల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించిన సీఎం ఉత్తమ సేవలందించిన పోలీసులకు పతకాలు అందజేశారు.

తల్లికి హోదా కావాలా?

తెలంగాణ చరిత్ర ఉన్నంతవరకు.. సోనియాగాంధీని ఈ సమాజం తల్లిగా గుర్తించి, గౌరవిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ గడ్డతో ఆమెది పేగుబంధమని, అది రాజకీయాలకు అతీతమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు తెలంగాణ ప్రదాత సోనియాగాంధీని ప్రత్యేక ప్రతినిధిగా ఆహ్వానిస్తే.. ఏ హోదాలో ఆమెను ఆహ్వానించారని కొంతమంది ప్రశ్నిస్తున్నారని తప్పుబట్టారు. బిడ్డ ఇంట్లో శుభకార్యానికి తల్లికి హోదా కావాలా? తల్లిని ఆహ్వానించడానికి బిడ్డకు ఒకరి అనుమతి అవసరమా? అని సీఎం ప్రశ్నించారు. మహాత్మాగాంధీ ఏ పదవిలో ఉన్నారని ఆయనను మనం జాతిపితగా గుర్తుంచుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియాగాంధీ, అప్పటి లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్, అప్పటి ప్రతిపక్ష నాయకురాలు, బీజేపీ నేత సుష్మాస్వరాజ్ పాత్ర మరువలేనిదన్నారు.


ట్యాంక్‌బండ్ వద్ద బాణసంచా వెలుగులు

అప్పుడు మిలియన్ మార్చ్..

ఇప్పుడు పదేళ్ల సంబురాలు



కళా ప్రదర్శనలకు వేదికైన ట్యాంక్‌బండ్.. ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు, పోలీసు ఫ్లాగ్‌మార్చ్

హైదరాబాద్ సిటీ, కవాడిగూడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ సమయంలో సాగరహారం.. మిలియన్ మార్చ్, వంటావార్పులకు వేదికైన ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం తెలంగాణ దశాబ్ది సంబురాలు అంబరాన్నంటాయి. వరణుడు కూడా ముఖ్యఅతిథిగా పాల్గొన్నాడా? అన్నట్లుగా గంటపాటు వాన దంచికొట్టినా.. కళాకారుల నృత్యాలు, పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ ఆగలేదు. అంతేనా..? గవర్నర్ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు వర్షంలో తడిసి ముద్దవుతున్నా.. వేడుకల్లో పాల్గొని, కళాకారుల నృత్యాలు, విన్యాసాలను వీక్షించారు. ప్రత్యేక స్టాళ్లను సందర్శించారు. తెలంగాణ కళారూపాలతో ట్యాంక్‌బండ్‌పై పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి స్వయంగా గవర్నర్‌కు కళాకారుల, చేతివృత్తిదారుల స్టాళ్లను చూపించారు. అనంతరం వారిద్దరూ జ్యోతిప్రజ్వలన చేసి, సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కళాకారులు, తెలంగాణ చరిత్ర, సంస్కృతిని చాటిచెప్పేలా కళలను ప్రదర్శించారు. తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మను సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ రాధాకృష్ణకు ప్రత్యేకంగా పరిచయం చేశారు. యక్షగానం, ఒగ్గు, గుస్సాడి, లంబాడ నృత్యాలతోపాటు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతం లౌడ్‌స్పీకర్లలో వినిపిస్తున్నప్పుడు ఐదు వేల మంది ట్రైనీ పోలీసులు జాతీయ జెండాలను చేతబట్టి నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ ఆహూతులను ఆకట్టుకుంది.

అబ్బురపరిచిన కళారూపాలు

డప్పు వాయిద్యాలు, బోనాలు, పోతరాజుల నృత్యాలు, అమ్మవారి ఘటాలతో ప్రదర్శన, బతుకమ్మ, గుస్సాడి, గొండుకోయ, ఒగ్గు కథలు, ఆదివాసీ నృత్యాలు, బైండ్ల జమిడకలు, పీర్ల ఉరేగింపు, ధింసా నృత్యాలు, చెంచు, కొమ్ముకోయ, లంబాడి మహిళల నృత్యాలు, జానపద కళాకారుల చిందు యక్షగానం ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలు జరుగుతుండగానే అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' పాటను వినిపించారు. ఇంద్రధనస్సును తలపించేలా బాణసంచా పేలుళ్లు, లేజర్‌లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దాదాపు 10 నిమిషాలపాటు బాణసంచా పేలుళ్లతో ట్యాంక్‌బండ్ పరిసరాలు సప్తవర్ణాలతో శోభిల్లాయి. రాష్ట్ర గీతాన్ని రచించిన అందెశ్రీ, స్వరపరిచిన ఎంఎం కీరవాణిని సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ రాధాకృష్ణన్ ఘనంగా సన్మానించారు. వేడుకల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు పతకాలు

ఉత్తమసేవలు అందించిన పోలీసులకు రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా అవార్డులను అందజేశారు. 2021, 2022 సంవత్సరాలకు గాను.. 22 మంది పోలీసు అధికారులు రాష్ట్రపతి పోలీస్ మెడల్, ఇండియన్ పోలీస్ మెడల్స్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి సీఎం అవార్డులు ఇచ్చారు. అవార్డులు అందుకున్న వారిలో ఒక అదనపు డీజీపీ, ముగ్గురు ఎస్పీ/కమాండెంట్లు, నలుగురు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, ముగ్గురు ఎస్సైలు, ఒక ఏఎస్సై, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులు ఉన్నారు. వీరిలో ఆబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, సీసీఎస్ ఏసీపీ ఎం.కిరణ్‌కుమార్, అంబర్‌పేట పీటీసీ డీఎస్పీ ఎం.పిచ్చయ్య, బేగంపేట ట్రాఫిక్ ఎస్సై ఆనంద్‌కుమార్, సైబరాబాద్ పరిధిలోని ఎస్‌బీ అదనపు డీసీపీ సంక్రాంతి రవికుమార్, ఎస్‌వోటీ అదనపు డీసీపీ శోభన్‌కుమార్, అల్వాల్ ఏఎస్సై ఎం.అనిల్‌గౌడ్ ఉన్నారు.


ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్, గవర్నర్ రాధాకృష్ణన్, మంత్రులు భట్టి, పొన్నం, కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా

